# పనులను వేగవంతం చేయాలి

- బడులు ప్రారంభం అయ్యే నాటికి.. మౌలిక సదుపాయాల పనులన్నీ పూర్తి కావాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ శశాంక, వివిధ శాఖల అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

రంగారెడ్డి, మే 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, బడులు పునః ప్రారంభం అయ్యే నాటికి పనులన్నీ పూర్తి కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. కొత్త విద్యా సంవత్సరంలో బడులు తెరుచుకునేందుకు మరో 20 రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి గడువులోపు పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతో పాటు, ధరణి దరఖాస్తులు, ప్రజావాణి అర్జీలు, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ లక్ష్య సాధన అంశాలపై శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.

**కలెక్టర్లకు అభినందనలు**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియను శాంతియుత వాతావరణంలో, సజావుగా నిర్వహించడంపై కలెక్టర్లను సీఎస్ ముందుగా అభినందించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సగానికి పైగా జిల్లాలు దాదాపు 90 శాతం వరకు పనులను గ్రౌండింగ్ చేశాయని, మిగతా జిల్లాలు కూడా అన్ని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని, అదే సమయంలో పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. బాలికలు ఉండే ప్రతి బడిలో తప్పనిసరిగా టాయిలెట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఊరు – మన బడి కింద ఇప్పటికే చేపట్టి వివిధ దశల్లో ఉన్న పనులను సైతం పూర్తి చేయించాలన్నారు.

**దుస్తులు, పుస్తకాలు అందించాలి**

విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం సమయానికే స్కూల్ యూనిఫారంలు, పాఠ్య పుస్తకాలు అందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సీఎస్ సూచించారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు యూనిఫామ్ క్లాత్‌ను సరఫరా చేశామని, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు వర్క్ ఆర్డర్ ఇచ్చి, సకాలంలో వారు విద్యార్థుల సంఖ్యకు సరిపడా పూర్తిస్థాయిలో స్కూల్ యూనిఫామ్‌లు తయారు చేసి ఇచ్చేలా చూడాలన్నారు.

**ధరణి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

ధరణి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సీ.ఎస్ సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష ఏర్పాటు చేసుకుని, వివిధ మాడ్యూల్స్ కింద వచ్చిన దరఖాస్తులను ఈ నెలాఖరు లోగా వందకు వంద శాతం పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత జిల్లాలకు పంపించామని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ దృష్ట్యా తాత్కాలికంగా ప్రజావాణిని నిలిపివేశామని, ఎన్నికల కోడ్ ముగిసిన మీదట యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజావాణి తిరిగి ప్రారంభించే లోపు పెండింగ్ అర్జీలను పరిష్కరిస్తూ, దరఖాస్తుదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

**రైస్ మిల్లులకు తరలించాలి**

ధ్యానం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణను వేగవంతం చేస్తూ, వెంటనే నిల్వలను రైస్ మిల్లులకు తరలించాలని సీఎస్ సూచించారు. అదే సమయంలో మిల్లులు పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు మిల్లింగ్ జరిపేలా పర్యవేక్షణ చేస్తూ, సీఎంఆర్ లక్ష్య సాధనకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ శశాంక సచివాలయం నుంచి పాల్గొన్నారు.

**సకాలంలో అందజేస్తాం**



రంగారెడ్డి : వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, ఇతర అధికారులు

ఈ సందర్భంగా స్కూల్ యూనిఫామ్స్ అందించడంపై కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లాలో రూరల్ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు 82,306 యూనిఫామ్స్, యూఎల్‌బీ పరిధిలోని ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు 47,722 యూనిఫామ్స్, జీహెచ్‌ఎంసీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు 50,131 యూనిఫామ్స్, మొత్తం 1,80,159 యూనిఫామ్స్ ను కుట్టించి సకాలంలో అందించేందుకు అవసరమైన టైలర్లను గుర్తించామని తెలిపారు. వారు యూ నిఫామ్స్ పాఠశాలలు పునః ప్రారంభం నాటికి తయారు చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, డీఈవో సుశీందర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీత రెడ్డి, డీసీసీవో ధాత్రి దేవి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు మనోహర్ రాథోడ్, విజయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పనులను పూర్తికి చర్యలు




వికారాబాద్ : వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు, అధికారులు

వికారాబాద్ : జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం వరి ధాన్యం సేకరణ, ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులు, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, ధరణిలో వచ్చిన అర్జీల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతి కుమారి కలెకర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలల్లో చేపడుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పర్యటించి నాణ్యత లోపం లేకుండా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నమన్నామని అదనపు కలెక్టర్ వివరించారు. విద్యార్థుల ఏకరూప దుస్తులు తయారీ పూర్తి దశకు చేరుకుందన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణాబాయి, డీఈవో రేణుకాదేవి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీసీవో ఈశ్వరయ్య, డీఎల్‌పీవో సంధ్యారాణి పాల్గొన్నారు.



బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పోల్డ్ ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్, కలెక్టర్ శశాంక

# స్ట్రాంగ్ రూంల పరిశీలన

రంగారెడ్డి, మే 17 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పోల్డ్ ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంకతో కలిసి అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ ముగిసిన అనంతరం మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటింగ్ యంత్రాలను బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో భద్రపర్చారు. అడిషనల్ సీఈవో లోకేష్ కుమార్ ఒక్కో స్ట్రాంగ్ రూంను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలు, వాటి పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిరంతర నిఘాలో భాగంగా అమర్చిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరు, వాటి ద్వారా కొనసాగిస్తున్న పర్యవేక్షణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అడిషనల్ సీఈవో వెంట కలెక్టర్ శశాంక, చేవెళ్ల ఆర్డీవో సాయిరామ్, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.



రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ జిల్లా అధికారిణి నీరజ

# ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

షాద్‌నగర్‌రూరల్, మే 17 : మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు చేస్తే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని ఉద్యాన వన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారిణి నీరజ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్లలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగవచ్చున్నారు. ఈ సాగుపై రైతులు అసక్తి కనబర్చాలన్నారు. ఇందుకోసం మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్, పంట నిర్వహణకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. అధికారుల సూచనలు, సలహాలతో సాగు చేస్తే ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. వ్యవసాయంపై రైతులు పామాయిల్ సాగు చేస్తూ అందులో అంతర పంటలుగా పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, చిరుధాన్యాలు పండించి అధిక లాబాలు పొందవచ్చున్నారు. ఈ సాగు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుందని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. రైతులు ఈ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎన్ రావు, వాల్యూ అయిల్ గ్యాస్ సర్వీసెస్ కంపెనీ వైస్ ప్రసిడెంట్ రామ్మోహన్‌రావు, డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజారత్నం, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారిణి ఉషారాణి, క్లస్టర్ ఏఈవో రమణరావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# 30లోపు పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ
- కొంపల్లి ఆదర్శ పాఠశాలలో పనుల పరిశీలన

వికారాబాద్, మే 17 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న అన్ని పనులను ఈ నెల 30లోపు పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొంపల్లి ఆదర్శ పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చేపడుతున్న పనులపై ఆరా తీశారు. జూన్‌లో పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని, ఈ నెల 30లోపు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. రంగులు వేయడం, టాయిలెట్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఉన్నారు.

# ఉపాధిహామీ పనుల పరిశీలన



నవాబుపేట,మే17:మండలంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను, ఉపాధి హామీ కార్యాలయంలోని కంప్యూటర్ సెంటర్ పని తీరును ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి పరిశీలించారు. మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల గురించి ఇన్‌చార్జి ఎంపీడీవో అజయ్‌కుమార్, ఏపీవో లక్ష్మీదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడుతూ పని చేసే సమయంలో ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారా? కూలీ ఎంత ఇస్తున్నారు, నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తంజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### మహిళల ఉపాధి కల్పనకు

# ప్రత్యేక చర్యలు

**అదనపు డీఆర్‌డీవో సరోజ**

దోమ, మే 17: మహిళల ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా కుట్టుశక్తి కేంద్రాలను నెలకొల్పుతున్నట్లు అదనపు డీఆర్‌డీవో సరోజ అన్నారు. దోమ మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మహిళా కుట్టుశక్తి కేంద్రాన్ని ఆమె డీపీఎం రామ్మూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలనే సదుద్దేశంతో మండల కేంద్రాల్లో మహిళా కుట్టు శక్తి కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడి పిల్లలకు స్కూల్ యూనిఫామ్స్ క్లాత్‌ను మహిళా సమాఖ్యలకు అందించి మహిళా కుట్టుశక్తి కేంద్రాల ద్వారా వాటిని కుట్టిస్తున్నది. ఇం దుకుగాను ఒక్క స్కూల్ యూనిఫామ్‌కు రూ 50 ప్రభుత్వం అందజేసి మహిళ లకు ఉపాధి కల్పిస్తున్నది. ఈ కార్యక్రమంలో ఏపీఎం సురేశ్, మహిళా సమాఖ్య సభ్యు లు, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో హార్డ్‌వేర్ షాపు దగ్ధం

- దాని పై అంతస్తులో ఉన్న వృద్ధురాలు, పిల్లలు సేఫ్
- దాదాపు రూ.2 కోట్ల వరకు ఆస్తినష్టం
- సహాయక చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు



మంటల్లో కాలిపోతున్న హార్డ్‌వేర్ దుకాణం

వికారాబాద్, మే 17 : విద్యుదాఘాతంతో ఓ హార్డ్‌వేర్ షాపు దగ్ధమైన ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, బాధితుల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రామయ్యగూడ రోడ్డులో భాగ్యల క్ష్మి హార్డ్‌వేర్ షాపు ఉన్నది. దాని పై అంతస్తులోనే షాపు యజమాని కుటుంబం నివ సిస్తున్నది. శుక్రవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో షాపులో ఉన్న విలువైన వస్తువులు మంటల్లో చిక్కుకున్నాయి. విషయం తెలుసుకున్న షాపు యజమా ని, స్థానికులు మంటలను ఆర్పేందుకు యత్నించినా మంటలు ఎగిసిపడడంతో.. వికారాబాద్, పరిగి నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించి ఇతర నీటి ట్యాంకర్లతో మంటల ను ఆర్పే ప్రయత్నం చేశారు. వికారాబాద్ సీఐ నాగరాజు సిబ్బందితో చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. షాపు పై అంతస్తులో ఉన్న యజమాని కుటుంబ సభ్యులు వృద్ధురాలు నాగలక్ష్మి, చిన్న పిల్లలను ఫైర్ సిబ్బంది రెస్క్యూ చేసి సురక్షితంగా బయటికి తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు రూ.2 కోట్ల వరకు ఆస్తినష్టం, సుమారు రూ.10 లక్షల వరకు నగదు కాలిపోయిందని బాధితు డు తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్, ము న్సిపల్ కమిషనర్ జాకిర్‌అహ్మద్, మున్సిపల్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ విషయాన్ని స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. తక్షణ సాయం కింద వారికి మున్సిపల్ చైర్‌పర్సన్, పట్టణాధ్యక్షుడు ఇరువురు రూ. 25 వేల చొప్పున, కౌన్సిలర్ సురేశ్ రూ. 5వేలు, స్నేహితులు, జువెల్లరీ షాపు యజమాని అశోక్ రూ.10వేలు అందజేశారు. బాధితుడిని ఆదుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

# జిప్సమ్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

- విద్యుదాఘాతంతో జరిగినట్లు తేల్చిన అధికారులు
- రూ. కోటి వరకు ఆస్తినష్టం



ఎగిసి పడుతున్న మంటలను అదుపు లోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాండూరు రూరల్, మే 17: మండలంలోని కరణ్‌కోట శివారులోని జిప్సమ్(ఇందూస్) కంపెనీలో గురువారం అర్ధరాత్రి 2 గంటల తర్వాత భారీ అగ్నిప్రమాదంజరిగింది. విద్యుదాఘాతంతో జరిగినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ప్రమాదంలో కంపెనీ షెడ్, మూడు జేసీబీలతో సహా రూ.కోటి వరకు ఆస్తినష్టం జరిగింది. రాత్రి 3 గంటల తర్వాత అగ్నిమాపక శాఖ అధికారులకు కంపెనీ నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. భారీగా అగ్నికీలలు ఎగిసిపడడంతో అగ్నిమాపక సిబ్బంది మూడు (తాండూరు, కొడంగల్, వికారాబాద్) ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చినట్లు అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి గోపాల్ తెలిపారు. ప్రమాద సమయంలో కార్మికులు అందులో లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

**ఆ గ్రామాలవాసులు నిద్రలేని రాత్రి..**

ఇదిలావుండగా కంపెనీ సమీపంలో మిట్టబాసుపల్లి, గుంతబాసుపల్లి గ్రామాలున్నాయి. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో వచ్చిన దుర్వాసనతో ఆ రెండు గ్రామాల ప్రజలు నిద్రలేకుండా గడిపారు. ఒక వైపు పొగ, మరో వైపు దుర్వాసన రావడంతో శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందిపడ్డారు. గతంలో ఈ కంపెనీపై కాలుష్య నియంత్రణ మండలి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ కంపెనీని అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఇదేవిధంగా కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మే 16న కూడా విద్యుదాఘాతంతో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరుగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా కరణ్‌కోట పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కంపెనీ నిర్వాహకుడు అమరేందర్ అగ్ని ప్రమాదం జరిగిదంటూ ఫిర్యాదు చేశాడు

# చెరువును తలపిస్తున్న మార్కెట్‌యార్డు



వర్షపు నీటిలో నుంచి వెళ్తున్న ధాన్యం బస్తాల ట్రాక్టర్లు

**చిన్నపాటి వర్షానికి నిలుస్తున్న నీరు**

పరిగి, మే 17 : పరిగిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణ చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి చెరువును తలపిస్తున్నది. పరిగి వ్యవసాయ మార్కెట్‌కు విక్రయాల కోసం ధాన్యం తీసుకువచ్చే రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిగి మార్కెట్‌యార్డులో గల అర్తి దుకాణాల ముందు సీసీ వేశారు. అలాగే గంజ్‌రోడ్డు నుంచి ప్రధాన రోడ్డుకు వెళ్లడానికి మార్కెట్‌యార్డు ద్వారా సీసీ రోడ్డు ఉన్నది. మధ్యలో గల స్థలం లోతట్టుగా ఉండడంతో చిన్న వర్షం కురిసినా నీరంతా మధ్యలో నిలిచిపోతున్నది. ఈ నీరు వెళ్లడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజుల తరబడి వర్షపు నీటితో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిగిలోని మార్కెట్ యార్డులో ప్రతి శుక్రవారం జరిగే బీట్లలో విక్రయించేందుకు పరిగి, దోమ, పూడూరు, బొం రాస్‌పేట మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు తీసుకు వస్తారు. వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువచ్చిన ట్రాక్టర్లు ఈ బురద నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుంది. అర్తి దుకాణాల ముందు స్థలం సరిపోని పరిస్థితిలో ధాన్యం ట్రాక్టర్లలోనే ఉంచాల్సిన పరిస్థితి. స్టాకుగా ఉంచడానికి సైతం ఇబ్బందిగా ఉండడంతో ట్రాక్టర్లలోనే ఉంచడం ద్వారా వాటికి రోజువారి అద్దె చెల్లించాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. ఒక్కోసారి వర్షపునీటి బురదలో ట్రాక్టర్లు దిగబడితే మరింత ఇబ్బంది తప్పడం లేదని వారు వాపోతున్నారు. లోతట్టు ప్రాంతంలో మట్టిని పోయడం ద్వారా నీరు నిలువకుండా చూడాల్సిందిగా రైతులు పేర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం కోటి రూపాయలు పైగా ఆదాయం వస్తున్నా చిన్నచిన్న పనులు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్ అధికారులు స్పందించి నీరు నిలువకుండా చూడాలని కోరుతున్నారు.

# సమన్వయంతో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

వికారాబాద్, మే 15 : జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పని చేయడంతోనే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా పూర్తయిందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో ముగియడంతో శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది కష్టపడి పనిచేసిన దానికి ఫలితం దక్కిందని, ఇక ముందు కూడా పోలీస్ అధికారులు అందరూ కలసి పనిచేసి విజయం సాధించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ డేవిడ్, అంజాత్ పాషా, జిల్లా పోలీస్ అధ్యక్షులు ఆశోక్, కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్న పోలీసు సిబ్బంది

# పరిషత్తులో సాహిత్య విమర్శ అధ్యయన శిబిరం రేపు

తెలుగు యూనివర్సిటీ, మే 17: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 19న ఆదివారం ఉదయం 10 గంటలకు సాహిత్య విమర్శ అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య శుక్రవారం తెలిపారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సభలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీ రామారావు ప్రధాన ప్రసంగం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం, 'ప్రాచీన సాహిత్య విమర్శ' అనే అంశంపై ఆచార్య మసన చెన్నప్ప, విమర్శ రీతులు అంశంపై డాక్టర్ సి.మృణాళిని, విమర్శ–విమర్శకుడు అంశంపై డాక్టర్ కోయి కోటేశ్వరరావు, విమర్శ ప్రక్రియలు అంశంపై డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి, విమర్శ ధోరణులు అంశంపై డాక్టర్ డి.చంద్రశేఖర రెడ్డి, ఆధునిక సాహిత్య విమర్శ వికాసం అంశంపై డాక్టర్ వి.త్రివేణి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

**19న అమృతలత - అపురూప అవార్డుల ప్రదానోత్సవం**

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో గల ఆడిటోరియంలో 19న ఆదివారం సాయంత్రం పలువురికి 'అమృతలత – అపురూప అవార్డులు' ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ నెల్లుట్ల రమాదేవి శుక్రవారం తెలిపారు. 2024వ సంవత్సరానికి గాను అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను సాహిత్యం – వైద్యం విభాగాలలో డాక్టర్ కేవీ కృష్ణకుమారి, డాక్టర్ ఆలూరి విజయలక్ష్మిలకు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అపురూప పురస్కారాలను జీఎస్ లక్ష్మి (కథా రచన), ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ (సాహితీ విమర్శ), శివలక్ష్మి (సినీ విశ్లేషణ), సావేరి దుర్గా భవాని (నాటక రంగం), ప్రొఫెసర్ సమతా రోష్ని (సామాజిక సేవ), నండూరి సుందరి నాగమణి (పద్య రచన), డాక్టర్ కొండపల్లి నీహారిణి (అంతర్జాల పత్రిక సంపాదకత్వం), జ్యోతిర్మయి మళ్ళ (సంగీతం – గజల్), అంజనీ యలమంచిలి (షార్ట్ ఫిలిం), గీతా హజారే (నృత్యం), ప్రేమ మాలిని (జర్నలిజం – ఎలక్ట్రానిక్ మీడియా), దేవనపల్లి వీణావాణి (కవిత్వం) ప్రక్రియలకు గాను ప్రదానం చేసి సత్కరిస్తామన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ ఓలేటి పార్వతీశం, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, సినీ నటి తులసి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.